క్లుప్తంగా

కొనసాగుతున్న గండి పూడ్చివేత పనులు


గండిని పూడ్చివేస్తున్న యంత్రం

వెల్దుర్తి: మల్లెపల్లె పంపింగ్ స్టేషన్ సమీపంలో హంద్రీనీవా కాలువకు పడిన గండి పూడ్చివేత చర్యలు కొనసాగుతున్నాయి. బుధవారం హెచ్ఎన్ఎస్ఎస్ డివిజన్–2 ఈఈ సురేశ్ రెడ్డి, డీఈ హరిప్రసాద్, జేఈల పర్యవేక్షణలో యంత్రాలతో గ్రావెల్, మట్టితో దాదాపు 8మీటర్ల మేర వెడల్పు, అంతే ఎత్తుతో మరమ్మతు పనులు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు కురిసిన వర్షంతో మరమ్మతు పనులకు కాస్త ఆటంకం కలిగిందని, ఇప్పటికే 60 శాతం పనులు పూర్తి చేశామని ఈఈ తెలిపారు. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే మరో రోజులో పనులు పూర్తి చేస్తామని చెప్పారు.

హైఓల్టేజీతో కాలిపోయిన టీవీలు, ఫ్యాన్లు


ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

మద్దికెర : స్థానిక గిడ్డయ్య వీధిలో బుధవారం హైఓల్టేజీ రావడంతో దాదాపు 20 టీవీలు, ఫ్యాన్లు కాలిపోయాయని బాధితులు వాపోయారు. బాధితులు గోపాల్, వెంకటేశులు, రామాంజులు, రమేష్ మాట్లాడుతూ గతంలో కూడా ఇలాగే హైఓల్టేజీ వచ్చి టీవీలు, ఫ్యాన్లు కాలిపోయాయన్నారు. హైఓల్టేజీ గురించి పలుమార్లు విద్యుత్ అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం మండిపడ్డారు. బుధవారం నాటి ఘటనలో తమకందరికీ కలిపి రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లిందని చెప్పారు. అధికారులు స్పందించి హైఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈ రఫీక్ అహమ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. దేవేంద్ర, రాజు, హుసేన్, రంజాన్, శ్రీనివాసులు, మల్లికార్జున ఉన్నారు.

వర్షం కోసం..


కలుగొట్లలో వర్షం కోసం పొలాల్లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


వెల్దుర్తి: వర్షం కోసం మూడు రోజులుగా కలుగొట్ల గ్రామ ముస్లింలు పొలాల్లో రోజు దిశలో ప్రార్థనలు చేస్తున్నారు. బుధవారం ప్రార్థనలు, దువా అనంతరం వారు మాట్లాడుతూ గురువారం ప్రార్థనల అనంతరం గ్రామంలోని దర్గాలో ఫాతెహాలు నిర్వహించి పూజలు పూర్తి చేస్తామని తెలిపారు.

రైతు ఆత్మహత్యపై విచారణ


రామళ్లకోటలో విచారణ చేస్తున్న ఏడీఏ, తహసీల్దార్, ఎస్ఐ, ఏఓ

వెల్దుర్తి: మండలంలోని రామళ్లకోట గ్రామంలో రైతు ఆత్మహత్యపై అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన కల్లా రామకృష్ణుడు ఈనెల 4న అప్పులబాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు పత్తికొండ ఏడీఏ మోహన్ విజయ్ కుమార్, తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, ఎస్ఐ సునీల్‌కుమార్, ఏఓ అక్బర్‌బాషా గ్రామానికి వెళ్లి విచారించారు. ఆత్మహత్యకు గల కారణాలపై గ్రామస్తులు, కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడన్న కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఆ కోణంలో లోతుగా విచారించారు. క్షేత్రస్థాయిలో పొలాలను పరిశీలించారు. పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు వారు తెలిపారు.

పాఠశాలలో ప్రమాదంపై విచారణ


మ్యాన్‌హోల్‌పై మూత ఏర్పాటు చేసిన దృశ్యం

వెల్దుర్తి: స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం గుంతలో పడి ఇద్దరు విద్యార్థినులు ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడిన సంఘటనపై హెచ్ఎం చంద్రావతి బుధవారం విచారణ చేపట్టారు. సెప్టిక్ ట్యాంక్ గుంతపై నున్న మూత పాతదై విరిగి పోవడంతోనే దానిపై నిలిచిన విద్యార్థినులు ప్రమాదం బారిన పడ్డారు. వెంటనే గుంతపై కొత్త మూత ఏర్పాటు చేయించారు. విద్యార్థినులను గుంత నుంచి కాపాడిన విద్యార్థిని ప్రతిభామాధురిని అభినందించారు.

బడుల్లో ఎన్నికల సందడి

- నేడు పాఠశాల నిర్వహణ కమిటీల ఎన్నికలు
- విద్యా కమిటీ సభ్యులకు రెండేళ్ల పదవీ కాలం
- ఇప్పటికే ఓటరు జాబితాను ప్రకటించిన ఉపాధ్యాయులు


జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల


ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

మద్దికెర /ఆలూరు: ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికల సందడి మొదలైంది. ప్రభుత్వ సూచనల మేరకు ఎంఈఓలు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు.

నేటి నుంచి ఎన్నికలు..

స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికల్లో సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్నికల అధికారులుగా ఉంటారు. తహసీల్దార్, ఎంపీడీఓ, వీఆర్వోలు ఎన్నికల పరిశీలకులుగా ఉంటారు. తల్లి, తండ్రి, పిల్లల సంరక్షులుగా ఉన్నవారు ఓటర్లుగా ఉంటారు. 8 తేదీ మధ్యాహ్నం ఒంటిగంట లోపు సభ్యులతో పాటు చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు కమిటీ తొలి సమావేశం నిర్వహిస్తారు. ప్రతి సభ్యుడికి రెండేళ్ల పదవీకాలం ఉంటుంది.

దృష్టి సారించిన కూటమి నేతలు..

కూటమి ప్రభుత్వం ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించింది. వారికి చెందిన వ్యక్తులనే చైర్మన్, వైస్ చైర్మన్లుగా ఎన్నుకునేందుకు పావులు కదుపుతున్నారు. క్షేత్రస్థాయిలో పట్టు సాధించేందుకు కూటమి నేతలు ఈ ఎన్నికలపై ప్రధానంగా దృష్టి సారించారు. రాజకీయాలకు అతీతంగా ఎన్నికలు జరిగి పాఠశాలల అభివృద్ధికి నాంది పలికే వారిని కమిటీ సభ్యులుగా ఎన్నుకుంటే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల నిర్వహణలో రాజకీయ పార్టీల ప్రమేయం ఉండటంతో ప్రభుత్వ అధికారులకు తలనొప్పిగా మారింది.

- బుధవారం ఆలూరు మండలం మొలగవెల్లి గ్రామంలో ఆలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాంనాథ్‌యాదవ్, టీడీపీ మండల కన్వీనర్ అశోక్, జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు విస్తృతంగా ప్రచారం చేశారు. అలాగే చిప్పగిరి, హాలహర్వి, హొళగుంద, దేవనకొండ మండలాల్లోని పాఠశాలల ఎస్ఎంసీ చైర్మన్‌ను దక్కించుకోవడంలో భాగంగా ఇప్పటికే ఉపాధ్యాయులపై ఒత్తిడి పెంచినట్లు తెలిసింది.

ఎన్నికల నిర్వహణ ఇలా ..

పాఠశాల సెక్షన్లు, మీడియంతో సంబంధం లేకుండా తరగతిని యూనిట్‌గా తీసుకొని ముగ్గురు సభ్యులను ఎన్నుకోవాలి. వీరిలో ఇద్దరు మహిళలు తప్పనిసరి. ముగ్గురిలో ఒకరు తప్పకుండా ఎస్సీ, ఎస్టీ, విభిన్న ప్రతిభావంతులు, మరొకరు బీసీ, ఈబీసీ, మైనార్టీకి చెందిన వారై ఉండాలి. తరగతి నుంచి సభ్యుల ఎన్నికకు 50 వాతం ఓటర్ల హాజరును రిజిస్టర్‌లో చూపిన తరువాతనే ఎన్నిక జరపాలి. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు కూడా 50 శాతం సభ్యుల హాజరు ఉండాలి. తరగతుల వారిగా ఎన్నికైన సభ్యులందరూ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలో సభ్యులుగా ఉంటారు.వీరంతా చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. ఒకవేళ ఆరుగురు విద్యార్థులు లేకపోతే మరో తరగతిలో విలీనం చేసి ఎన్నుకోవాలి.

ఎస్ఎంసీలకు ప్రాణం పోసిన జగన్ ప్రభుత్వం

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఊపిరిపోసింది. అంతకుముందు పేరుకే ఈ కమిటీలను ఎన్నుకుని పెత్తనమంతా అధికార పార్టీ నేతలు చెలాయించేవారు. కమిటీ సభ్యులు నామమాత్రంగా మారడంతో బడులు అభివృద్ధికి నోచుకోలేదు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్ఎంసీలకు పాఠశాల నిర్వహణ, అభివృద్ధిలో కీలక బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వం మంజూరు చేసిన నాడు–నేడు నిధులను ఈ కమిటీలకే అప్పగించారు. రాజకీయ ఒత్తిళ్లు లేకుండా చేయడంతో పాఠశాలలు అన్ని విధాలుగా అభివృద్ధి దిశగా పయనించాయి. ప్రతి నెలా కమిటీ సమావేశాలు నిర్వహించి విద్యార్థుల పురోగతి, పాఠశాల అభివృద్ధిపై సమీక్షలు కూడా జరిగాయి.

నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల వివరాలు

మండలం	ప్రాథమిక	ప్రాథమికోన్నత	ఉన్నత పాఠశాలలు
మద్దికెర	17	03	06
పత్తికొండ	31	06	08
తుగ్గలి	42	17	08
కృష్ణగిరి	30	04	08
వెల్దుర్తి	37	08	15
మొత్తం	157	38	45

ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిపిద్దాం



ఎస్ఎంసీ ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిపిద్దాం. పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులనే కమటీ సభ్యులుగా, చైర్మన్లు, వైస్ చైర్మన్లుగా ఎన్నుకుంటారు. పాఠశాల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసే ఎన్నికల్లో రాజకీయాలకు అతీతంగా వ్యవహరిస్తాం. ఇప్పటికే పాఠశాలల్లో ఓటర్ల జాబితాలను ప్రచురించాం. నేడు 8వ తేదీన ఎన్నికలు జరిపి చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను ఎన్నుకుంటారు.

– రంగస్వామి, ఎంఈఓ, మద్దికెర.

పోలీసుల సహకారం తీసుకుంటాం

మండలంలో నేడు జరగనున్న ఎస్ఎంసీ ఎన్నికల సందర్భంగా పోలీసులకు సమాచారం ఇచ్చాం. మండలం 36 ఎంపీపీ, 11 జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8,500 మంది విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నట్లు గుర్తించాం. ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి గ్రామానికి పోలీసులను పంపాలని ఎస్ఐ ఓబులేసును కోరాం.

– కోమలాదేవి ఆలూరు ఎంఈఓ

పంటల నమోదు తప్పనిసరి

దేవనకొండ: ఖరీఫ్‌లో పంటలను సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి సురేష్‌బాబు సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ – పంటలో నమోదు చేయించుకోవడం వల్ల ప్రభుత్వం అందించే నష్టపరిహారం, పంట దిగుబడులకు గిట్టుబాటు ధర లభిస్తాయన్నారు. దగ్గరలోని రైతుసేవా కేంద్రాలకు వెళ్లి 1బీ అడంగళ్, బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డు జిరాక్స్, మొబైల్ నంబర్‌తో పంటల నమోదు దరఖాస్తు ఫారాన్ని అందించాలన్నారు. వివరాలకు స్థానిక రైతుసేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలని చెప్పారు.

విద్యార్థిని మృతికి కారకులెవరు?

ఆలూరు: మంత్రాలయం నియోజకవర్గంలోని రచ్చుమర్రి మెడల్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థిని కురుబ పార్వతి మృతికి ప్రధాన కారకులేవరనేది విద్యాశాఖ అధికారులు తేల్చాలని ఆలూరు నియోజకవర్గ మాదాసి, /మాదరి కురుబ సంఘం కన్వీనర్ డికే రాజ్, ప్రధానకార్యదర్శి పెద్దహ్యాట మల్లయ్య బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మృతికి కారణాలను తేల్చకుండా విచారణ పేరుతో కాలయాపన చేయడం దారుణమన్నారు.

హొళగుంద: మంత్రాలయం నియోజకవర్గం మాధవరం మండలం రచ్చుమర్రి గ్రామ సమీపంలోని మోడల్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న సుంకేశ్వర గ్రామానికి చెందిన కురువ పార్వతి ఆత్మహత్య కారుకులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాదాసి, మాదారి కురువ సంఘం తాలూకా కన్వీనర్ డికే నాగరాజు, ప్రధాన కార్యదర్శి పెద్యాట మల్లయ్య డిమాండ్ చేశారు. బుధవారం వారు హొళగుందలో విలేకరులతో మాట్లాడుతూ ఆత్మహత్యనా లేదా ఎవరైనా హత్య చేశారా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టాలని కోరారు.

నేడు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు


ఎన్నికల్లో పాల్గొనాలంటూ తల్లిదండ్రులకు పంపిన ఆహ్వాన పత్రం

వెల్దుర్తి: పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రులను భాగం చేసేందుకు ఏర్పాటు చేసే స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ఈనెల 8వ తేదీ గురువారం జరుగనున్నాయి. ఈ మేరకు ఇప్పటికే మండలంలోని 58 జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల, ఎస్సీ, బీసీ గురుకులం, కేజీబీవీ రెసిడెన్షియల్ ప్రిన్సిపాళ్లు ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు పూర్తి చేసినట్లు ఎంఈఓ–2 రమేశ్ తెలిపారు. ఎన్నికలకు హాజరు కావాలని ఆయా పాఠశాలల విద్యార్థుల తల్లితండ్రులకు ఇప్పటికే ఆహ్వానాలు అందించామన్నారు. ఉదయం ముగ్గురు సభ్యులు, మధ్యాహ్నం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉంటుందని చెప్పారు. అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు రామళ్లకోట జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సందర్శించిన సందర్భంగా ఎస్ఐ సునీల్ కుమార్ తెలిపారు.

చిప్పగిరి: ఎస్ఎంసీ ఎన్నికలు సంబంధించి విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండలంలో మొత్తం 26 పాఠశాలల్లో గురువారం ఎన్నికలు జరగ నున్నాయి. 16 గ్రామాల్లో కూటమి నాయకులు తమ కార్యకర్తలను చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు కై వసం చేసుకోవడానికి మంతనాలు ప్రారంభించినట్లు తెలిసింది.తమ కార్యకర్తలకే ఇవ్వాలంటూ టీడీపీ, జనసే నాయకులు పోటీ పడుతున్నట్లు సమాచారం.

హొళగుంద: పాఠశాల యాజమన్య కమిటీ ఎన్నికలకు అన్నీ ఏర్పాట్లు చేసినట్లు ఎంఈఓ–1 సత్యనారాయణ, ఎంఈఓ–2 జగన్నాథం బుధవారం తెలిపారు. మండలంలో మొత్తం 42 పాఠశాలలో 1 – 10 వ తరగతులు చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఓటు హక్కు కలిగి ఉన్నారని వారు చెప్పారు. గురువారం ఉదయం సభ్యుల ఎన్నిక, మధ్యాహ్నం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక, ప్రమాణ స్వీకారం, మొదటి సమావేశం నిర్వహణ ఉంటుందని వారు వివరించారు.

నేడు విగ్రహాల ఊరేగింపు


ఆలయ ఆవరణకు ధ్వజస్తంభాన్ని చేరుస్తున్న గ్రామస్తులు

దేవనకొండ: స్థానిక శ్రీ లక్ష్మీసమేత చెన్నకేశవస్వామి ఆలయంలో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలను పురస్కరించుకొని గురువారం ఆలయం నుంచి నూతన విగ్రహాలను గ్రామవీధుల్లో ఊరేగిస్తామని గ్రామపెద్దలు, నిర్వాహకులు తెలిపారు. కాగా బుధవారం ధ్వజస్తంభాన్ని ప్రొక్లెయిన్ సాయంతో ఆలయ ఆవరణలోకి చేర్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయంలో శ్రీ గణపతి, నాగదేవత, నవగ్రహ, ధ్వజస్తంభం, బీసీ కాలనీలో ఆంజనేయస్వామి విగ్రహం, ధ్వజస్తంభం, శిఖర కలశ ప్రతిష్ఠ ఉంటుందని చెప్పారు. శుక్రవారం జీర్ణోద్ధరణ, ధ్వజస్తంభం, బొడ్రాయి (నాభిశిల)ను ప్రతిష్ఠింపజేస్తామన్నారు. అదే రోజు ఉదయం ప్రాతఃకాల పూజలు, తెల్లవారుజామున 1:50 గంటల్లోపు యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, దీక్షా హోమం, కళాన్యాసం, ఓక్షాగ్నిజ్వాల, బలిహరణ, పూర్ణాహుతి, మహామంగళహారతి తదితర విశేష పూజలు జరిపిస్తామని వివరించారు.

20న సామాజిక తనిఖీ మండల సభ

వెల్దుర్తి: ఉపాధి హామీ పథకం పనులు, పింఛన్ల సామాజిక తనిఖీ మండల స్థాయి సమావేశం (సోషల్ ఆడిట్ పబ్లిక్ హియరింగ్) ఈనెల 20వ తేదీన స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించనున్నట్లు ఏపీఓ రాజునాయక్, సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పీ ఆవులయ్య తెలిపారు. బుధవారం స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో వారు మాట్లాడుతూ మండలంలోని 22 పంచాయతీల్లో నిర్వహించిన రూ.17,70,33,019 విలువైన 1,420 ఉపాధి పనులు, 20 పీఆర్ పరిధిలో పనుల సామాజిక తనిఖీ ప్రక్రియ ఇప్పటికే ఒక సీఆర్‌పీ, 9మంది డీఆర్‌పీలతో ప్రారంభించామన్నారు. డీఆర్‌డీఏ పరిధిలోని పింఛన్లను సైతం విచారిస్తామని, అనర్హత ఉన్న పింఛన్ల తొలగింపునకు తగు ధృవపత్రాలతో ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు చెప్పారు.

మస్టర్లు సక్రమంగా నిర్వహించాలి

కృష్ణగిరి: ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి మస్టర్లు సక్రమంగా నిర్వహించాలని ఎస్ఆర్‌పీ విజయభాస్కర్ తెలిపారు. మండలంలోని ఎరుకలచెర్వు, పోతుగల్లు గ్రామాల్లో బుధవారం జరిగిన సామాజిక తనిఖీ గ్రామసభల్లో ఆయన పాల్గొన్నారు. చేసిన పనులకు ఎప్పటికప్పుడు రికార్డుల నిర్వహణ ఉండాలన్నారు. అర్హులైన ప్రతి కూలీకి పనులు కల్పించడంతోపాటు వారికి క్షేత్రస్థాయిలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అబ్జర్వర్ మురళీమోహన్, ఏపీఓ శేషిరెడ్డి, ఈసీ చెన్నకేశవులు, డీఆర్‌పీలు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు ఎనలేని ప్రయోజనం

వెల్దుర్తి: బిడ్డ పుట్టిన గంటలోపే తల్లి ముర్రుపాలు, ఆ తర్వాత రెండేళ్ల పాటు తల్లిపాలందించడం ఇటు తల్లికి, అటు బిడ్డకు ఎంతో మంచిదని సీడీపీఓ ల్యాక్ తెలిపారు. గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాధాన్యతను వివరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదేశించారు. ఈనెల 1న ప్రారంభమైన తల్లిపాల వారోత్సవాలు ముగిసిన నేపథ్యంలో బుధవారం ఆయన స్థానిక తన కార్యాలయంలో వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రెండు మండలాల సూపర్‌వైజర్లు సునీత, సరస్వతి, శ్రీదేవి పాల్గొన్నారు.

వెల్దుర్తిలో 47 మి.మీ వర్షపాతం నమోదు


వెల్దుర్తి వంకలో పారుతున్న వర్షపు నీరు

వెల్దుర్తి: మండలంలో బుధవారం ఉదయానికి 47.3మి.మీల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ అభిమన్యు తెలిపారు. మంగళవారం రాత్రి 10 గంటల నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు చినుకులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. దీంతో వంకలు, వాగులు పారాయి. ఈ వర్షం పంటలకు ఊపిరి పోసిందని ఏఓ అక్బర్‌బాషా తెలిపారు. వెల్దుర్తి, గుంటుపల్లె, మదార్‌పురం తదితర రైల్వే అండర్‌వే బ్రిడ్జ్‌లలో నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మదార్‌పురం రైల్వే అండర్‌వేలో నీరు అధికంగా నిలిచిపోవడంతో గ్రామస్తులు, రైతులు రాకపోకలకు ఇబ్బందులుపడ్డారు.

ఆధార్ అవస్థలు


హాలహర్వి పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్ వద్ద గుమిగూడిన ప్రజలు, విద్యార్థులు

హాలహర్వి: కొత్తగా ఆధార్ కార్డు పొందాలన్నా, ఉన్న వాటిల్లో మార్పులు, చేర్పులు చేసుకోవాలన్నా ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం బడిలో చేరిన విద్యార్థులు ఇందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్ వద్ద ప్రజలు గుమిగూడుతున్నారు. విద్యార్థి ఆధార్ నంబర్, ఫోన్ నంబర్ లింక్ తప్పకుండా ఉండాలి. బయోమెట్రిక్ అప్‌డేట్ కూడా ఉండాలి. చాలామంది గ్రామీణ ప్రాంత విద్యార్థుల ఆధార్ నంబర్‌కు ఫోన్ నంబర్ లింక్ లేకపోవడంతో దరఖాస్తు చేసుకోవడంలో వెనకబడుతున్నారు. అలాగే ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న ప్రతి పథకానికి ఆధార్ లింక్ తప్పనిసరి చేయడంతో నమోదు, మార్పులకు ప్రజలు భారీగా వస్తున్నారు. ఆధార్ కార్డు ప్రవేశపెట్టిన సమయంలో తీసుకున్న చాలా మందికి వారి ఫోన్ నంబర్, ఆధార్ కార్డుకు లింక్ లేదు. ఓటీపీ నంబర్ తెలుసుకునేందుకు ఆధార్ కేంద్రం నిర్వాహకులే వారి నంబర్లు ఇచ్చి అప్పటికి పని ముగించారు. ఇప్పుడు విద్యార్థులకు ప్రభుత్వ పథకాలు వర్తించాలన్నా, అడ్మిషన్ నంబర్ కోసం ఆధార్‌ను తప్పనిసరి చేయడంతో విద్యార్థులు రోజూ ఆధార్ కేంద్రం చుట్టూ తిరుగుతున్నారు. మండలానికి ఒక్క కేంద్రమే ఉండటంతో పనులు త్వరగా కావడం లేదు. అలాగే వచ్చే జనాభా అవసరాలకు సరిపోవడం లేదు. సర్వర్ సమస్య కారణంగా రోజుకు పది మందికి మించి సేవలు అందడం లేదు.

ఎన్ఎంఎంఎస్‌కు దరఖాస్తు చేసుకోండి

తుగ్గలి : ప్రస్తుత విద్యా సంవత్సరంలో నిర్వహించే ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్) ప్రవేశ పరీక్షకు అర్హత, ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పత్తికొండ, తుగ్గలి ఎంఈవోలు రమేష్, రామవెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 8వ తరగతి చదవుతున్న విద్యార్థులు అర్హులన్నారు. విద్యార్థుల కుటుంబ ఆదాయం రూ.3.5 లక్షల లోపు ఉండాలన్నారు. ప్రవేశ పరీక్ష ఈ ఏడాది డిసెంబర్ 8న నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జనరల్, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 దరఖాస్తు రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. సెప్టెంబర్ 6వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పరీక్ష రుసుం ఆన్‌లైన్‌లో పేర్కొన్న లింక్ ద్వారా మాత్రమే చెల్లించాలని స్పష్టం చేశారు.వివరాలకు ఎంఈఓ కార్యాలయాలు, హెచ్ఎంలను గానీ సంప్రదించాలని కోరారు.

ప్రతిష్ఠాపన పూజలు ప్రారంభం

ఆస్పరి: మండలంలోని కైరుప్పల గ్రామంలో బుధవారం నరసప్ప స్వామి నూతన ఆలయ గోపురం కలశ స్థాపన పూజలు ప్రారంభమయ్యాయి. ఈనెల 9వ తేదీన జరగనున్న ప్రతిష్ఠాపన సందర్భంగా ఆలయంలో బుధవారం గంగపూజ, జలాదివాసం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, కలశ స్థాపన, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం కలశ పూజ, నవగ్రహ హోమం, ధాన్యాధివాసము, రుద్రహోమం, శుక్రవారం నరసప్ప స్వా మి, వినాయక, నాగదేవతలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నీటి సమస్య తలెత్తనీయొద్దు

తుగ్గలి(పత్తికొండ) : పత్తికొండ పట్టణానికి మంచి నీటి సమస్య లేకుండా చూడాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అధికారులను ఆదేశించారు. కొత్తపల్లి నుంచి పట్టణానికి మంచినీటిని సరఫరా చేసే పథకం ఫిల్టర్‌బెడ్ మరమ్మతు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. పట్టణంలో అన్ని వీధులకు క్రమం తప్పకుండా మంచి నీటిని సరఫరా చేసేలా చూడాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మహబూబ్‌ఖాన్, ఈవో నరసింహులు పాల్గొన్నారు.

డ్రైనేజీలు నిర్మించాలి

ఆస్పరి: మండలంలోని కైరుప్పల గ్రామంలో డ్రైనేజీలు నిర్మించాలని ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సునీతకు వినతి పత్రం అందజేశారు. ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ గ్రామంలోని వీరభద్రస్వామి ఆలయం నుంచి ఆంజనేయ స్వామి ఆలయం వరకు సిమెంట్ రోడ్లు నిర్మించినా డ్రైనేజీలు నిర్మించకపోవడంతో మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుందన్నారు. పలుచోట్ల గుంతలు ఉండటంతో వాటిల్లో మురుగునీరు నిలిచిపోయి దోమలు విజృంభిస్తున్నా చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. శేఖర్, చందు, ధనుంజయ,భద్రి, రాఘవేంద్ర పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం సరఫరాను నివారించాలి


ఆలూరులో సిబ్బందితో మాట్లాడుతున్న సెబ్ డిప్యూటీ కమిషనర్ విజయ శేఖర్

ఆలూరు రూరల్: కర్ణాటక మద్యం అక్రమ రవాణాను అరికట్టాలని, ఇందుకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని అనంతపురం సెబ్ డిప్యూటీ కమిషనర్ విజయ శేఖర్ సిబ్బందికి సూచించారు. బుధవారం ఆలూరు సెబ్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. కర్ణాటక మద్యం సరఫరాపై ప్రత్యేక నిఘా వేయాలన్నారు. ఆంధ్ర–కర్ణాటక సరిహద్దుల్లో నిత్యం వాహనాల తనిఖీలు చేపట్టాలని చెప్పారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఆర్టీఏ అధికారుల నుంచి వ్యాల్యువేషన్ వేయించి వేలాలు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే నాటుసారా తయారీ, విక్రయాలను అరికట్టాలన్నారు. సీఐ మల్లిక, సిబ్బంది ఉన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

హొళగుంద మండలం నెరణికి తండా గ్రామ శివారు కొండల్లోని నాటుసారా స్థావరాలపై బుధవారం దాడులు నిర్వహించినట్లు సెబ్ ఎస్ఐ వీరస్వామి తెలిపారు. 1,520 లీటర్ల బెల్లం ఊట, సారా బట్టీలను ధ్వంసం చేసినట్లు చెప్పారు. 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు.


లక్కసాగరం సమీపంలో సజ్జ కంకులకు ప్లాస్టిక్ కవర్లు కట్టిన దృశ్యం

పంటకు రక్షణ కవచాలు

కృష్ణగిరి: పంటలను సాగు చేయడం ఒక ఎత్తయితే.. వాటిని కాపాడుకోవడం రైతులకు మరో ఎత్తు. ఖరీఫ్‌లో భాగంగా మొదటి పంటగా మండలంలోని రైతులు సాగు చేసిన సజ్జ పంట చేతికొచ్చింది. గింజలు పాలుపోసుకోవడంతో పక్షులు పంటపై దాడి చేస్తున్నాయి. కంకుల్లోని గింజలను తింటున్నాయి. దీంతో వాటి నుంచి కాపాడుకోవడానికి వివిధ మార్గాలను అనుసరిస్తున్నారు. కొందరు మెరిసే టేప్‌ను పొలం చుట్టూ చుడుతుండగా, మరికొందరు డబ్బాలో రాళ్లు పోసుకొని శబ్దాలు చేస్తున్నారు. మండలంలోని లక్కసాగరం, ఆలంకొండ తదతర గ్రామాల రైతులు మాత్రం కంకుల వద్ద ప్లాస్టిక్ కవర్లు కట్టారు. ఇవీ గాలికి రెపరెపలాడటంతోపాటు శబ్దం వస్తుండటంతో పక్షులు భయంతో పంటపై దాడి చేసే అవకాశం తక్కువగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

12 నుంచి సర్పంచ్‌లు, పీఎస్‌లకు శిక్షణ

కృష్ణగిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు మూడు రోజులు గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ట్రైనర్స్‌ల సమక్షంలో రిఫ్రెషర్ కోర్సుపై శిక్షణ ఉంటుందన్నారు. సర్పంచ్‌లు, గ్రేడ్–1, గ్రేడ్–4 పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరు కావాలని సూచించారు.